సాక్షి
వికారాబాద్

శనివారం, 1, మార్చి, 2025



పాత మండలంలోనే పరీక్షలు

దుద్యాల మండల కేంద్రంగా ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా పదో తరగతి పరీక్ష కేంద్రం మాత్రం ఏర్పాటు చేయలేదు. 8లో▸



వ్యసనాలకు దూరంగా..

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ సూచించారు. 8లో▸



నిరుపయోగంగా..

గ్రామ పంచాయతీల్లో రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 9, 10, 11 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు శ్రీను, గోపాల్, చిన్న నర్సింలు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

పరిగి: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి అవలంబిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. శుక్రవారం పరిగి మండలం సయ్యద్‌పల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన సంస్థ ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో రైతులకు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతి సాగుకు తేలికపాటి నేలలు అనుకూలమన్నారు. కొన్నేళ్లుగా పత్తి దిగుబడులు నిలకడగా ఉన్నాయని, దిగుబడి పెంచేందుకు ఈ పద్ధతి దోహదం చేస్తుందన్నారు. కూలీల అవసరం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు 'ఏఐ' దోహదం

డీఈఓ రేణుకాదేవి




బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ విద్యను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

దోమ: చిన్నారుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృత్రిమ మేధ (ఏఐ)ఎంతో దోహదపడుతుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శుక్రవారం దోమ మండలం బొంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఏఐ విద్యను పరిశీలించారు.విద్యార్థులకు చదవడం ,రాయడం, సంఖ్యాపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిగత స్థాయిలో వారి విద్య ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం వంటి చర్యలను ఉపాధ్యాయులు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెరగాలి

జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన ఆమె పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షల మార్కుల జాబితాను సబ్జెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, ఉత్తమ ఫలితాలు వస్తే తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందన్నారు. విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సమయం వృథా చేసుకోకుండా ప్రత్యేక సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌ఓ రమేశ్, ఎంఈఓ వెంకట్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, సీఆర్‌పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుస్తీపట్లు పడుతున్న మల్లయోధులు

కుస్తీమే సవాల్

జీవన్గీలో ఉత్సాహంగా అంతర్రాష్ట్ర పోటీలు

- హోరాహోరీగా తలపడిన మల్లయోధులు
- విజేతగా నిలిచిన కర్ణాటక పహిల్వాన్ సిద్ధు
- వెండి కడియం, నగదు బహుమతి అందజేత
- తరలివచ్చిన వేలాది జనం
- ముగిసిన మహాదేవ లింగేశ్వర 39వ జాతర



విజేత సిద్ధుకు కడియం తొడుగుతున్న అజయ్‌ప్రసాద్, అధికారులు

బషీరాబాద్: మండలంలోని జీవన్గీ మహాదేవ లింగేశ్వర జాతరలో భాగంగా శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీపట్లు జాతీయ స్థాయి రెజ్లర్ పోటీలను తలపించాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలివచ్చిన కండలు తిరిగిన పహిల్వాన్లు భీకర పోరాటం చేశారు. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ జాతీయ స్థాయి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పదేళ్ల బాలుడి మొదలుకొని నలభై ఏళ్ల యువకులు పోటీల్లో తలపడ్డారు. ఫైనల్ పోటీలో మహారాష్ట్రకు చెందిన సంతోష్‌పై కర్ణాటకకు చెందిన సిద్ధు పైచేయి సాధించి విజేతగా నిలిచారు.

ముగిసిన జాతర

మండలంలోని జీవన్గీ గ్రామంలో కాగ్నానది ఒడ్డున వెలసిన మహాదేవ లింగేశ్వర స్వామి 39వ జాతర అట్టహాసంగా ముగిసింది. ఉత్సవాల చివరి రోజున సంప్రదాయంగా వస్తున్న అంతర్రాష్ట్ర కుస్తీ పట్ల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా వీరులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోని బీదర్, గుల్బర్గా, సోలాపూర్, లాతూర్ జిల్లాల నుంచి వందల మంది మల్లయోధులు తరలివచ్చారు. సుమా రు 150 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఆయా స్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు. ఫైనల్ పోటీలో కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా ఆలంద తాలూకా పరిధిలోని బెలంగికి చెందిన సిద్ధు పూజారి మూడోసారి విజేతగా నిలిచారు.

విజేతలకు ఘన సన్మానం

కుస్తీ పట్ల పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన సిద్ధూ పూజారి, సంతోష్ పాటిల్‌ను ఆలయ కమిటీ తరఫున ఘనంగా సన్మానించారు. విజేతలకు నావంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి చెరో వెండి కడియం తొడిగి నగదు బహుమతి అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్, ఎస్‌ఐ శంకర్ విజేతలకు నగదు బహుమతి అందజేశారు. అంతకు ముందు స్వామివారి కలశానికి వేలం నిర్వహించగా బషీరాబాద్‌కు చెందిన ఆర్తి పర్తాని రూ.1,05,000 సొంతం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు మునీంధర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నర్సిరెడ్డి, కేశవరెడ్డి, వీరారెడ్డి, మల్లికార్జున్ స్వామి, మల్లప్ప, నరేందర్‌రెడ్డి, రాములు, బసప్ప, బాలకృష్ణా, సోమశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

రంజాన్‌కు పక్కాగా ఏర్పాట్లు

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రంజాన్ మాసంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి రంజాన్ పర్వదినాన్ని విజయవంతం చేయాలన్నారు. ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. మసీదులు, ఈద్గాల వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. శాంతిభద్రతలను నిశితంగా పరిశీలించాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఇన్‌చార్జ్ డీఎండబ్ల్యూఓ హనుమంతరావు, అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, డీపీఓ జయసుధ, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా, మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో, మెడికల్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులను విస్మరించిన ప్రభుత్వం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

దోమ: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను విస్మరించిందని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఆరోపించారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాజ్యాధికార సాధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు ఎన్నో హామీలు ఇచ్చారని.. వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. 14 నెలలు కావస్తున్నా పింఛను మొత్తం పెంచలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించినప్పటికీ తెలంగాణలో మాత్రం ఎలాంటి రిజర్వేషన్లు అమలు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్, పరిగి మండల అధ్యక్షుడు చంద్రయ్య, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మీడియా కన్వీనర్ మహేశ్, నేతలు మంగమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సునీలం

ఐక్యంగా భూములను కాపాడుకోవాలి

మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం

యాచారం: రైతులు ఐక్యంగా ఉండి తమ వ్యవసాయ భూములను కాపాడుకోవాలని మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం అన్నారు. మండల పరిధిలోని తాడిపర్తిలో శుక్రవారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో 'భూసేకరణ చట్టాలు, భూములను ఎలా కాపాడుకోవాలి, రైతుల సాదక బాధకాలపై' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఐకమత్యంతో ఉంటే ఏ చట్టాలూ ఏమీ చేయలేవన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ కొత్త నల్లా చట్టాలను రద్దు చేసే వరకు నెలల కొద్దీ ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల అంగీకారం లేనిదే ఏ సర్కార్‌కు కూడా ఎకరా భూమిని తీసుకునే అధికారం లేదని స్పష్టం చేశారు. 2013 భూసేకరణ చట్టం, రైతులకు కల్పించిన హక్కులు, రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను తెలుసుకోవాలని సూచించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు మాట్లాడుతూ.. ఫార్మాసిటీతో ఎలాంటి ముప్పు ఉంటుందో తెలియజేశారు. సమావేశంలో హైకోర్టు లాయర్ శ్రీకాంత్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవులు సరస్వతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ శంకర్

అనంతగిరి: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ తెలిపారు. శుక్రవారం నగరం నుంచి సీఎస్ శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద అత్యవసర మందులు, ఏఎన్‌ఎం, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్‌డీఓ వాసుచంద్ర, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.శంకర్ నాయక్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ లీలావతి, వైద్య, పోస్టల్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

5నుంచి ఇంటర్ పరీక్షలు

మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ ఎస్.శంకర్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6,418మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,496మంది.. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 5,589, ఒకేషనల్ విద్యార్థులు 1,374 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు కే.రూపాలక్ష్మి, సత్తయ్య, జిల్లా బల్క్ ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, కుమారస్వామి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వరరావు, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది, కస్టోడియన్స్ పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల దుర్మరణం

లారీ రూపంలో కబళించిన మృత్యువు

- తాండూరు మండలం చెంగోల్ సమీపంలో రోడ్డు ప్రమాదం
- అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టిన వాహనం
- అక్కడికక్కడే కొడుకు.. ఆస్పత్రిలో తండ్రి మృతి
- అనాథలైన తల్లీపిల్లలు



గోపయ్య గౌడ్ (ఫైల్)



నర్సింలు గౌడ్ (ఫైల్)



ప్రమాద స్థలంలో నర్సింలు గౌడ్ మృతదేహం, తీవ్ర గాయాలతో గోపయ్య గౌడ్

తాండూరు రూరల్: రెండు నిమిషాల్లో ఇల్లు చేరాల్సిన తండ్రీకొడుకులను మృత్యువు రూపంలో వచ్చిన లారీ కబళించింది. ఈ విషాదకర ఘటన శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చెంగోల్‌లో చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. చెంగోల్‌కు చెందిన ఈడ్గి గోపయ్యగౌడ్(72), నాగమ్మ దంపతులకు ఐదుగురు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం. నాగమ్మ మూడేళ్ల క్రితం మృతిచెందింది. పిల్లలందరికీ వివాహాలు కావడంతో అత్తవారిళ్లలో ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు నర్సింలుగౌడ్(40) అల్లాపూర్ మార్గంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద కిరాణ దుకాణం నడుపుతూ, వంట మాస్టర్‌గా పని చేస్తూ.. భార్య నర్మద, కొడుకులు మహేశ్, నానితో కలిసి అక్కడే ఉంటున్నాడు. స్వగ్రామంలో ఉండే తన తండ్రి గోపయ్యగౌడ్ అనారోగ్యానికి గురవడంతో తాండూరులోని ఆస్పత్రిలో చూపించి, ఉదయం 11గంటలకు స్కూటీపై చెంగోల్‌కు బయలుదేరాడు. రెండు నిమిషాల్లో ఇల్లు చేరుతారనగా బైపాస్ రోడ్డులో కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ వెనకనుంచి వచ్చిన లారీ (టీఎస్ 34 టీబీ 0118) వీరిని ఢీకొట్టింది. లారీ చక్రాలు నర్సింలు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గోపయ్యకు తీవ్ర గాయాలు కావడంతో తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించిన కొద్ది సేపటికే మరణించాడు. నర్సింలు, గోపయ్య మృతితో నర్మద, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోస్టుమార్టం గదిలో తండ్రి, తాత మృతదేహాలను చూసి చిన్నారులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అతివేగం, అజాగ్రత్తగా లారీ నడిపి, ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం గ్రామంలోని శ్మశానవాటికలో తండ్రీకొడుకుల అంత్యక్రియలు నిర్వహించారు.

కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలి

కందుకూరు: విద్యార్థుల యూనిఫాం కొలతల ప్రకారం, నాణ్యతతో కుట్టాలని డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశించారు. మండల పరిధిలోని పులిమామిడిలో శుక్రవారం సెర్ప్ అధికారులు, ఐకేపీ సిబ్బందితో పాటు స్వయం సహాయక గ్రూపుల మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది కుట్టిన యూనిఫాం విషయమై ఫిర్యాదులు వచ్చాయని, ఈ దఫా ముందుగానే ప్రతి విద్యార్థి కొలతలు తీసుకుని పాఠశాలలు తిరిగి పునఃప్రారంభమయ్యేలోపు అందించేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులతో యూనిఫాం విషయమై చర్చించారు. అంతకుముందు గ్రామ పంచాయతీ నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ సరిత, ఏపీఎం కవిత, పీఏఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, టీఏ బాల్‌రెడ్డి, ఐకేపీ సీసీలు, ఏఫ్‌ఏలు ఉన్నారు.



స్వయం సహాయక గ్రూపు మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

విన్యాసాలు అదుర్స్



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న జాగిలాలు



మంటల్లో నుంచి దూకుతున్న జాగిలం

మొయినాబాద్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రెనింగ్ అకాడమీ(ఐఐటీఏ)లో శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న 72 జాగిలాల 24వ బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాగిలం హాండ్లర్ (యజమాని) చెప్పినట్లుగా నమస్కారం చేయడం.. జాతీయ జెండాకు గౌరవ వందనం చేయడం.. యజమాని పడుకోమని చెబితే పడుకోవడం.. దొర్లమని చెబితే దొర్లడం.. మంటల్లో నుంచి దూకడం.. యజమాని వస్తువు పడిపోతే వెతికి పట్టుకురావడం.. న్యూస్ పేపర్, ఇతర వస్తువులు తెచ్చివ్వడం.. కదిలే వాహనాలపై యజమాని చెప్పిటన్లు గౌరవ వందనం సమర్పించడం.. మందు పాత్రలను గుర్తించడం.. శత్రువులపై దాడి చేసి పట్టుకోవడం వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ఇంటిలిజెన్స్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పాత మండలంలోనే పరీక్ష


దుద్యాల్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్న 10వ తరగతి విద్యార్థులు

ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటుకు వెనుకడుగు

- రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నా ఫలితం శూన్యం
- దూరభారంతో విద్యార్థులకు ఇబ్బందులు
- అధికారులు పునరాలోచించాలని తల్లిదండ్రుల వినతి

దుద్యాల్: దుద్యాల మండల కేంద్రంగా ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా పదోతరగతి పరీక్ష కేంద్రం మాత్రం ఏర్పాటు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దుద్యాల అభివృద్ధిలో వేగం పుంజుకుంది. రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, విద్యుత్, విద్యాశాఖలు, పోలీస్ స్టేషన్ వంటి వాటిని తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. పదోతరగతి పరీక్షలకు పాత మండల కేంద్రాల్లోనే సెంటర్లు ఏర్పాటు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక మండలంగా ఏర్పాటు అయిన నాటి నుంచి పదోతరగతి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు. గతంలో పోలీస్‌స్టేషన్ లేక ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం ప్రత్యేక ఠాణా ఏర్పాటు చేసి సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ పరీక్ష కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం మండలం నుంచి 164మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతుండగా కుదురుమల్ల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాత మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో, దుద్యాల్, హకీంపేట్, చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాత మండల కేంద్రమైన బొంరాస్‌పేట్‌కు వెళ్లి పరీక్షలు రాయాల్సి ఉంది. ఎగ్జామ్ సెంటర్లు వెళ్లాలంటే దాదాపు 10 నుంచి 20 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి దుద్యాల్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు

పాఠశాల	విద్యార్థుల సంఖ్య
దుద్యాల	51
హకీంపేట	51
కుదురుమల్ల	18
చెట్టుపల్లి తండా	44
మొత్తం	164

ప్రయాణం ఇబ్బంది



దుద్యాల్ జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్నా.. పరీక్ష కేంద్రం స్థానికంగా లేకపోవడంతో ఇబ్బంది తలెత్తుతోంది. పలుమార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదు. దుద్యాల్ నుంచి బొంరాస్‌పేట్‌కు వెళ్లి పరీక్షలు రాసేందుకు ప్రత్యేక వాహనం మాట్లాడుకోవాలి. బస్సు సౌకర్యం లేదు. ముందుగా వెళ్లాలి. సమయం వృథా అవుతుంది. చదివిన సమాధానాలు మరిచిపోయే అవకాశం ఉంది. అధికారులు పునరాలోచించి తక్షణమే దుద్యాల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి.

– నవనీత, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, దుద్యాల్

ప్రశ్నపత్రాల భద్రతకు ఇబ్బంది



పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు విద్యాశాఖ నుంచి ప్రయత్నం చేశాం. పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాలు భద్రపరుచుకునేందుకు అవకాశం లేకపోవడంతో అధికారులు వెనకడుగువేశారు. ఠాణా తాత్కాలిక భవనంలో కొనసాగుతుండడంతో పరీక్షలకు సంబంధించిన విలువైన పత్రాలు భద్ర పరిచే అవకాశం లేదు. పోలీసు అధికారులను విద్యాశాఖ పలుమార్లు సంప్రదించి వెనుకడుగు వేసింది. వచ్చే వార్షిక పరీక్షలు దుద్యాల మండల కేంద్రంలోనే నిర్వహిస్తాం.

– విజయరామా రావు, ఎంఈఓ, దుద్యాల్

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

- తీర్పు వెలువర్చిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి


శ్రీనివాస్ శవానికి పంచనామా చేస్తున్న అప్పటి ఎస్‌హెచ్‌ఓ రాజు (ఫైల్)

ధారూరు: భూ తగాదాలు, రాజకీయ కక్షలతో బీఆర్ఎస్ నాయకుడిని దారుణంగా హత్యచేసిన కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. ఎస్పీ నారాయణరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ధారూరు మండలం మైలారానికి చెందిన పెండ్యాల శ్రీనివాస్(38) వికారాబాద్‌లో నివాసం ఉండేవాడు. స్వగ్రామంలో పొలం పనులు చూసుకునేందుకు ఏప్రిల్ 22, 2018 రోజున హరిదాస్‌పల్లికి చెందిన వినోద్‌కుమార్‌తో కలిసి మైలారానికి బయలుదేరారు. ఇదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దారికాచి మారణాయుధాలు, కర్రలతో శ్రీనివాస్‌ను హత్యచేశారు. వీరి నుంచి తప్పించుకున్న వినోద్‌కుమార్ మృతుడి భార్య యాదమ్మకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం హత్య చేసింది తామేనంటూ మైలారానికి చెందిన మద్దులపల్లి దాసు, మద్దులపల్లి ప్రశాంత్‌కుమార్, మద్దులపల్లి అరుణ్‌కుమార్, మద్దులపల్లి భాస్కర్ గంటల వ్యవధిలోనే పీఎస్‌లో లొంగిపోయారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీ శిరీష, సీఐ ఉపేందర్, ఎస్‌హెచ్‌ఓ రాజు అన్ని సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో వాదోపవాదాలు విన్న జడ్జి హంతకులకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నగదు చెల్లించని పక్షంలో నాలుగు నెలల సాధారణ శిక్ష అనుభవించాలన్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమరసింహారెడ్డి కేసును వాదించారని, ప్రస్తుత సీఐ రఘురాం, ఎస్ఐ అనిత కేసును పర్యవేక్షించారని ఎస్పీ వెల్లడించారు.

కోటబాసుపల్లిలో చిరుత పులి పిల్ల

- డీహైడ్రేషన్‌తో అస్వస్థత
- చికిత్స అందిస్తుండగా మృత్యువాత
- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారుల సూచన


అస్వస్థతకు గురై మృతి చెందిన చిరుత పులి పిల్ల

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామ శివారులో చిరుతపులి పిల్ల కలకలం రేగింది. కొన ఊపిరితో ఉన్న చిరుత పిల్లను చూసిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న వారు చికిత్స నిమిత్తం తాండూరులోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా చిరుత పిల్ల మరణించింది. పుట్టిన 48 గంటల్లో డీహైడ్రేషన్ కారణంగా అస్వస్థతకు గురై మృతి చెందిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవిసరస్వతి తెలిపారు. కర్ణాటక ప్రాంతంలోని చించోళి పరిసర ప్రాంతంలోని అడవి నుంచి చిరుతలు సంచరించే అవకాశం ఉందన్నారు. కోటబాస్పల్లితో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి..

- బావబామ్మర్దుల మృతి
- భద్రాచలంలో ఘటన
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు


హరిప్రసాద్ మృతదేహం


పవన్ మృతదేహం

ధారూరు: దైవదర్శనం కోసం వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానానికి దిగిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతుల కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హరిసాద్‌పల్లి గ్రామానికి చెందిన పత్తి నర్సింలు, భీమమ్మ దంపతుల రెండో కుమారుడు హరిప్రసాద్(21) భద్రాద్రి కొత్తగూడెంలో బీఫార్మసీ చదువుతున్నాడు. నర్సింలు సోదరి మంజుల ఖమ్మంలో ఉంటారు. ఆమె రెండో కుమారుడు పవన్(22) పదోతరగతి ఫెయిల్ అవడంతో తండ్రి రాజుకు తోడుగా ఉంటున్నాడు. శుక్రవారం నర్సింలు దంపతులు, అయన చెల్లెలు మంజుల కుమారుడు పవన్ భద్రాచలం శ్రీరాముడి దర్శనానికి వెళ్లారు. ముందుగా స్నానం చేసేందుకు అందరూ కలిసి గోదావరి నది వద్దకు చేరుకున్నారు. హరిప్రసాద్, పవన్ స్నానానికి వెళ్లిన సమయంలో నది ప్రవాహం పెరగడంతో నీటమునిగారు. కొడుకు, అల్లుడు కళ్లెదుటే నీటమునగడం గమనించిన నర్సింలు విలపిస్తూ అటుగా పరుగు తీశాడు. గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీయించారు. చేతికి అంది వచ్చిన కళ్లెదుటే కానరాని లోకానికి వెళ్లిపోవడంతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

ఎర్రమట్టి తవ్వకాలపై ఆగ్రహం

అక్రమార్కులను అడ్డుకున్న భక్తులు

అనంతగిరి: ఎర్రమట్టి తవ్వకాలను అక్రమంగా చేపడుతుండగా భక్తులు అడ్డుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ మండల పరిధిలోని పులుసుమామిడిలో చోటు చేసుకుంది. మహాశివరాత్రి సందర్భంగా పులుసుమామిడి సమీపంలోని పరమేశ్వరుడి గుట్టచుట్టూ శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పలువురు అక్రమార్కులు ఆయలం వెనుక భాగంలో గుట్ట తవ్వకాలు చేపడుతుండగా గమనించి అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా ఈ అక్రమం తంతు కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు ఎర్రమట్టి తవ్వకాల చేపడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధ్యనతనిస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుస్మసముద్రంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాంచందర్ నాయక్, నాయకులు వెంకటయ్య, లక్ష్మయ్య, బాబు పాల్గొన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయండి

టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్

అనంతగిరి: యుద్ధభేరిని విజయవతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ పిలుపునిచ్చారు. వికారాబాద్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 2న యుద్ధభేరి సభను తలపెట్టామన్నారు. ఏకీకృత పెన్షన్ విధానం ఉద్యోగులను మోసగించి కార్పొరేట్ శక్తుల కడుపు నింపేందుకేనని ఆరోపించారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై యూపీఎస్ విధానంపై వ్యతిరేకతను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు మురహరినాథ్, దేవ్యా, జహంగీర్, విష్ణువర్ధన్, రజిత, ప్రతాప్‌రెడ్డి, వెంకటయ్య, బుచ్చయ్య, శ్రీశైలం కరుణాకర్, విజయభాస్కర్ రెడ్డి, నర్సింహరాజు, నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


శివారెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

ఆర్ఐ రాంగోపాల్

బంట్వారం: పౌరహక్కులను ప్రతీ ఒక్కరు గౌరవించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంగోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బస్వాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలుంటాయని చెప్పారు. పౌర హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కులం, మతం, వివక్ష, అంటరానితనం రూపుమాపాలన్నారు. స్వేచ్ఛా, సమానత్వం జీవించే హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో

కోట్‌పల్లి మండలంలోని జిన్నారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ యూనిస్ ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాగ్యలక్ష్మి, మర్పల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: బస్వాపూర్‌లో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ రాంగోపాల్

కలిసిమెలిసి జీవించాలి

మోమిన్‌పేట: ప్రతి ఒక్కరు కలిసి మెలిసి జీవించాలని ఆర్ఐ గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో పౌరహక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సోదర భావంతో కలిసి మెలిసి జీవించాలన్నారు. రాజకీయ లబ్ధికొరకు నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తారని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అంటరానితనం అమానుషమని ప్రస్తుతం గ్రామాలలో అలాంటి వ్యవస్థ లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులకు భంగం కల్గితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ జైపాల్‌రెడ్డి, ఏఎస్ఐ దత్తాత్రి, కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

దోమ: నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ గ్రామానికి చెందిన యువకుడు(20), తమ ఇంటి సమీపంలో ఉండే బాలికకు చాక్లెట్ ఇస్తానని చెప్పి లైంగికదాడికి యత్నించాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని పట్టుకొని చితకబాది పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇతని వ్యవహార శైలి ఇలా ఉండటంతో గతంలోనే దేహశుద్ధి చేశామని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ ఆనంద్‌కుమార్‌ను వివరణ అడగగా.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, బాధిత చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందర్శన



అనంతగిరి: వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న ఎల్ఆర్ఎస్ స్కీం ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మహేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతగిరి: రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు శుక్రవారం వికారాబాద్‌లోని పలు మీ సేవల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అధికారులు ఒక్కసారిగా వచ్చి మీ సేవ కేంద్రంలోకి ఎవరిని అనుమతించకుండా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఆపరేటర్‌తో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. ఈ క్రమంలోనే మీసేవకు సంబంధించిన అనుమతి పత్రాలు, సర్వీసెస్ చార్ట్, రుసుము చార్ట్ తదితర సేవలపై ఆరా తీశారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం


రైతు జలంధర్‌రెడ్డి జొన్న పంటను సందర్శించిన సూపరింటెండెంట్ ఇంజనీర్ లీలావతి

జిల్లా ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ లీలావతి

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: ఎట్టకేలకు విద్యుత్ అధికారులు స్పందించారు. ఈ నెల 27న 'సాక్షి'దినపత్రికలో 'పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?'శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ లీలావతి శుక్రవారం రైతు జలంధర్‌రెడ్డి జొన్న పంటను పరిశీలించారు. విషయం తెలుసుకున్న రైతు నాయకులతో కలిసి ట్రాన్స్‌కో ఎస్ఈని కలిసి సమస్యను వివరించారు. లోఓల్టేజీ సమస్యతో మోటార్లు నడవక ఇబ్బంది పడుతున్నామని చుట్టుపక్కల రైతులు అధికారులకు చెప్పారు. ధారూరు సబ్ స్టేషన్ నుంచి మున్నూరు సోమారం సబ్‌స్టేషన్‌కు మార్చినప్పటి నుంచి తమకు సమస్య వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమసమస్యను పట్టించుకోవడం లేదని ఏఈ వేణుగోపాల్‌రెడ్డిపై రైతులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఈ ఆయన్ను మందలించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

మెరుగైన విద్యుత్ సరఫరా: లీలావతి

పంటలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల పునర్ధరణ చర్యలతో అంతరాయం లేకుండా చూసుకుంటున్నామని చెప్పారు. జలంధర్‌రెడ్డి బావిలో నీరు తగ్గిందని, ఈ నీటిని పలువురు రైతులు వినియోగించడం వల్లే లోఓల్టేజీ, విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఆమె వివరించారు. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇంటర్మీడియట్ పోల్స్, ఆన్ ఆఫ్ స్విచ్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయించామని ఆమె రైతులకు సమాధానమిచ్చారు. రైతుల ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణరెడ్డి, ఏఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి వచ్చిన ఎస్ఈకి మున్నూరు సోమారం సబ్ స్టేషన్‌ను సందర్శించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తుండగా

హోంగార్డును ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు


గాయపడిన హోంగార్డు కృష్ణ

అనంతగిరి: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ ద్విచక్రవాహనదారుడు హోంగార్డును ఢీకొట్టాడు. ఈ ఘటన శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు తెలపిన ప్రకారం.. వికారాబాద్ ట్రాఫిక్ విభాగం సిబ్బంది ధన్నారం రోడ్డు కట్టెల మిషన్ సమీపంలో సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. శ్రీరాంనగర్ తండాకు చెందిన లాల్‌సింగ్ మద్యం సేవించి అదే మార్గంలో ప్రయాణిస్తూ పోలీసులను గమనించి తప్పించుకునేందుకు యత్నించాడు. ఈ క్రమంలో ఎదుట ఉన్న హోంగార్డు కృష్ణను ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు సైతం గాయపడ్డాడు. గాయపడిన హోంగార్డును ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్

తాండూరు రూరల్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెంగోల్ జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నిజాముద్దీన్, హెచ్ఎం నర్సయ్య నాయక్, కానిస్టేబుళ్లు భీమయ్య, రమేష్, మహేష్, కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులతో శనివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓ విశ్వప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్ గేస్‌పూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఇప్పటికే రైతు భరోసా అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు 144 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు లబ్ధిదారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు. మోత్కుపల్లి, బార్వాద్, కరీంపూర్, నాగసాన్‌పల్లి, బీరోల్ గ్రామాల విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు మహిళా జాబ్‌మేళా

ఆమనగల్లు: ఈ నెల 2న మహిళా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఈ మేళా ఉంటుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్య, ఉపాధి లక్ష్యాలుగా ఫౌండేషన్ పనిచేస్తోందని చెప్పారు. 3 వేల మంది మహిళలకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని తుక్కుగుడ సమీపంలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు వేతనంతో పాటు ఉచిత బస్ సౌకర్యం, భోజన వసతి, బీమా, పీఎఫ్ సౌకర్యాలుంటాయన్నారు. పదవతరగతి, ఆపైన చదివిన మహిళలు 18 నుంచి 33 ఏళ్ల లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అప్రైజర్స్ గ్లోరీ'సాయం అభినందనీయం

సీఐ శ్రీనివాస్‌రెడ్డి


సీఐకి చెక్కు అందజేస్తున్న సంస్థ చైర్మన్

పరిగి: సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సాయం చేయడం అభినందనీయమని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పరిగి ప్రాంతంలోని జాతీయ రహదారిపై సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు దాతల సాయం కోరారు. దీంతో అప్రైజర్స్ గ్లోరీ సంస్థ వారు ముందుకు వచ్చి పది సీసీ కెమరాల ఏర్పాటుకు రూ.3లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. హైవేపై నప్రమాదాలు, దారిదోపిడీలు నిత్యకృత్యమయ్యాయని వాటి నిర్మూలణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయించామని చెప్పారు. పట్టణ కేంద్రంతో పాటు గ్రామాల్లోని కిరాణం దుకాణాల్లో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అఫ్షన్ సలాం, ప్రతినిధులు కలీం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్నస్వామి ఉత్సవాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో మలన్న స్వామి వారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వేకువ జామున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మల్లన్న స్వామి నామ స్మరణతో అగ్నిగుండాలు తొక్కి భక్తిని చాటుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.